ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 34.0 । కనిష్ఠం : 22.0

ANDHRAJYOTHY

5



నారాయణపేట

జిల్లా వార్తలు

గురువారం 8 ఫిబ్రవరి 2024

అధ్యక్షా!

- నేటి నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు
- అభివృద్ధి పనులకు నిధులు కోరతాం
- పెండింగ్ బిల్లులు, గ్రామాల్లో సమస్యలపై విన్నవిస్తాం
- 'ఆంధ్రజ్యోతి'తో ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు

అసెంబ్లీ సమావేశాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటిసారి బడ్జెట్ ప్రవేశపెట్టనుండటంతో అటు ఎమ్మెల్యేలతో పాటు, ఇటు ప్రజలు అభివృద్ధి పనుల మంజూరు, పెండింగ్ పనుల పూర్తిపై ఆశలు పెట్టుకున్నారు. అసెంబ్లీకి మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యేల్లో సగానికిపైగా కొత్తవారే ఉన్నారు. ఈ సందర్భంగా అసెంబ్లీలో ఏం మాట్లాడతారని 'ఆంధ్రజ్యోతి' శాసన సభ్యులను అడిగింది. వారు లేవనెత్తే అంశాలు వారి మాటల్లోనే..

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, మహబూబ్‌నగర్



అసెంబ్లీ భవనం

అభివృద్ధి పనులపై ప్రస్తావిస్తాను



కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రెండు గ్యారంటీలను అమలు చేశాం. మరో రెండు గ్యారంటీలకు ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించనున్నారు. మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో అభివృద్ధి పనుల విషయమై ప్రస్తావిస్తాను. ఆర్థిక వ్యవస్థ గాడిన పెట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. గత ప్రభుత్వంలో మాదిరిగా అనవసరపు ప్రాజెక్టులను టేకప్ చేసి, డబ్బులు వృథా చేయకూడదని విన్నవిస్తాను.


- యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే

100 పడకల ఆస్పత్రి కావాలి



గత ప్రభుత్వంలో పెండింగ్ ప్రాజెక్టులు చాలా ఉన్నాయి. కరివెన రిజర్వాయర్‌ను పూర్తి చేయలేదు. కోయిల్‌సాగర్ ఆయకట్టు పెంచలేదు. ఆ పనులన్నీ పూర్తి చేసేలా బడ్జెట్‌లో పెట్టేందుకు అడుగుతాం. దేవరకద్రలో 100 పడకల ఆస్పత్రి, కొత్తకోటలో 50 పడకల ఆస్పత్రి, నియోజకవర్గ కేంద్రంలో చాలా రోజులుగా డిమాండ్ ఉన్న డిగ్రీ కాలేజీ ఏర్పాటు కోసం ఇప్పటికే సీఎం దృష్టికి తీసుకెళ్లాను. వాటిని మంజూరు చేయిస్తాను.

- జి.మధుసూదన్‌రెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే



ఉమ్మడి జిల్లా ప్రగతి కోసం కృషి చేస్తా

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రగతి కోసం కృషి చేస్తా. జిల్లా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు ప్రయత్నిస్తా. ప్రధానంగా పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి కోసం నిధులు మంజూరు, పనులు వేగవంతంగా జరిగేలా ప్రభుత్వాన్ని కోరతా. విద్య, వైద్యం అందిస్తూ నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేలా నిధులు మంజూరు చేస్తా.

- మంత్రి జూపల్లి కృష్ణారావు

పెండింగ్ బిల్లులపై దృష్టి



వనపర్తి నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు సంబంధించి రూ.250 కోట్ల మేర పెండింగ్ బిల్లులు ఉన్నాయి. మెడికల్ కాలేజీకి రూ.64 కోట్లు, రోడ్లకు రూ.26 కోట్ల బిల్లులను ఈ సమావేశాల్లో మంజూరు చేయించేందుకు ప్రయత్నిస్తున్నాం. వనపర్తి, పెబ్బేరు పట్టణాల్లో రోడ్ల విస్తరణ పనులకు నిధులు మంజూరు చేయాలని కోరుతా. గ్రామాల్లో డెవలప్‌మెంట్, సర్పంచులకు పెండింగ్ బిల్లులపై ప్రస్తావిస్తాను.

- తూడి మేఘారెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే

పునరావాస సమస్యపై ఫోకస్



మక్తల్ నియోజకవర్గంలో నిర్మించిన ప్రాజెక్టులకు సంబంధించి ఎన్నో ఏళ్లుగా పునరావాస సమస్య తీవ్రంగా వేధిస్తోంది. గత ప్రభుత్వం వారికి పెండింగ్ పరిహారం ఇవ్వకుండా ఇబ్బందులు పెట్టింది. ఈ బడ్జెట్ సమావేశాల్లో పునరావాస సమస్యలు పరిష్కరించాలని, పరిహారం ఇవ్వాలని కోరబోతున్నాం. అలాగే నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని ఇప్పటికే సీఎం దృష్టికి తీసుకెళ్లాను. బడ్జెట్‌లో మంజూరు చేయించుకుంటాను.

- వాకిటి శ్రీహరి, మక్తల్ ఎమ్మెల్యే

జీఓ 69 సాధిస్తాం..



నారాయణపేట- కొడంగల్ ఎత్తిపోతల పథకం(జీవో 69) ద్వారా నియోజకవర్గంలోని 1.5 లక్షల ఎకరాలకు సాగునీటిని అందిస్తాం. ఈ అంశాన్ని బడ్జెట్ సమావేశాల్లో ప్రస్తావిస్తా.

- చిట్టెం పర్ణికారెడ్డి, నారాయణపేట ఎమ్మెల్యే

నిధులు కేటాయించాలి



అలంపూర్ నియోజకవర్గంలోని తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం కింద మల్లమ్మకుంట, జూలకల్, వల్లూరు రిజర్వాయర్ల నిర్మాణానికి నిధులు అడుగుతా. ఆర్డీఎస్ కెనాల్‌ను డీ40 వరకు కాంక్రీట్‌తో ఆధునికీకరించాలి. డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలి. గురుకులాలకు భవనాలు మంజూరు చేయాలి.

- విజయుడు, అలంపూర్ ఎమ్మెల్యే

సాగునీటి అంశాన్ని ప్రస్తావిస్తా



ఎంజీఎల్ఐ పథకం ద్వారా కల్వకుర్తి నియోజకవర్గంలోని చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించాలనేది నా ఆకాంక్ష. ఈ డిమాండ్‌ను అసెంబ్లీలో ప్రస్తావిస్తా. కల్వకుర్తి, ఆమనగల్‌లో వంద పడకల ఆస్పత్రులు నిర్మించాల, ఆమనగల్‌లో డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలలు ఏర్పాటు చేయాలని కోరుతా.

- కశిరెడ్డి నారాయణరెడ్డి, కల్వకుర్తి ఎమ్మెల్యే

అదనపు రిజర్వాయర్లు నిర్మించాలి



ఎంజీఎల్ఐ పథకంలో మెట్ట భూములకు నీరందడం లేదు. డిస్ట్రిబ్యూటరీ వ్యవస్థ, అదనపు రిజర్వాయర్ల నిర్మాణాన్ని చేపట్టాలని, గ్రామీణ రోడ్లు బాగు చేయాలని, పాఠశాలలను సరిగా నిర్వహించాలని కోరుతా.

- కూచకుళ్ల రాజేష్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే

నిధులివ్వాలని అడుగుతా



గత ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టింది. సీఎం ప్రత్యేక నిధుల కింద గద్వాల మునిసిపాలిటీకి రూ.50 లక్షలు, గ్రామ పంచాయతీలకు రూ.10 లక్షల చొప్పున మంజూరు చేశారు. ఆ నిధులను ప్రస్తుత ప్రభుత్వం ఆపింది. గతంలో మంజూరైన పనులు, నిధులు ఇవ్వాలని అడుగుతా

- బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, గద్వాల ఎమ్మెల్యే

భూముల ఆక్రమణను తెలుపుతా



బల్మూరు మండలం అనంతవరం వద్ద ఆనకట్ట నిర్మాణాన్ని చేపట్టేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా. నియోజకవర్గంలో ప్రభుత్వ భూములను బీఆర్ఎస్ నాయకులు, ఆంధ్ర ప్రాంతం వారు ఆక్రమించుకున్నారు. వాటిపై విచారణ చేయాలని కోరతా. విద్యా సంస్థలు నెలకొల్పాలని అడుగుతా.

- చిక్కుడు వంశీకృష్ణ, అచ్చంపేట ఎమ్మెల్యే



పీయూలో ఆందోళన చేస్తున్న విద్యార్థులు

పీయూలో ఉద్రిక్తత

- ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థుల చలో వర్సిటీ
- సమస్యలు పరిష్కరిస్తామని రాసివ్వాలని డిమాండ్
- వీసీ ఘెరావ్.. చాంబర్ లోపల ఉంచి తాళం
- పోలీసుల జోక్యంతో విరమణ



వీసీని చాంబర్‌లో ఉంచి విద్యార్థులు వేసిన తాళం

పాలమూరు యూనివర్సిటీ, ఫిబ్రవరి 7: పాలమూరు యూనివర్సిటీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని విద్యార్థులు వర్సిటీలో బుధవారం ధర్నాకు దిగారు. ఏబీవీపీ రాష్ట్ర కమిటీ పిలునిచ్చిన చలో పీయూ కార్యక్రమంలో భాగంగా నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి జిల్లా నుంచి విద్యార్థులు అధిక సంఖ్యలో తరలొచ్చారు. ముందుగా ప్రధాన గేటు నుంచి పీయూ పరిపాలన భవనం వరకు ర్యాలీ చేశారు. నేరుగా వీసీ చాంబర్‌లోకి వెళ్లే ప్రయాత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. తర్వాత పోలీసులను తోసుకుని వీసీ చాంబర్‌లోకి వెళ్లి, దాదాపు గంటపాటు చాంబర్‌లో బైఠాయించారు. వర్సిటీలో లా, ఇంజనీరింగ్ కోర్సులను ప్రవేశపెట్టాలని, సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను రెగ్యులర్ కోర్సులుగా మార్చాలని, సెమిస్టర్ ఫీజులు తగ్గించాలని, గర్ల్స్ హాస్టల్ నిర్మించాలని డిమాండ్ చేశారు. వీసీతో వాగ్వాదానికి దిగారు. దాంతో వీసీ ప్రొఫెసర్ ఎల్‌బీ లక్ష్మీకాంత్ రాథోడ్ బయటికి వచ్చి విద్యార్థులకు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. వీలైనంత త్వరగా సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు. అయినా విద్యార్థులు వినలేదు. సమస్యలను నెల రోజుల్లో పరిష్కరిస్తామని లఖిత పూర్వకంగా రాసివ్వాలని డిమాండ్ చేశారు. అందుకు వీసీ ఒప్పుకోలేదు. తన చాంబర్‌కు వెళ్లే ప్రయత్నం చేయగా, విద్యార్థులు ఘెరావ్ చేశారు. పోలీసులు విద్యార్థులను తప్పించే ప్రయత్నం చేశారు. విద్యార్థులు అక్కడే బైఠాయించి పోలీసులతో వాగ్వాదానికి దిగారు. తర్వాత వీసీ తన చాంబర్‌లోకి వెళ్లగా, ఆయన బయటికి రాకుండా ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీ బయట నుంచి తాళం వేశారు. సమస్యలు పరిష్కరిస్తామని లిఖిత పూర్వకంగా రాసివ్వాలని డిమాండ్ చేశారు. పరిస్థితి తీవ్రత దాటుతుందని భావించిన వన్ టౌన్ సీఐ ప్రత్యేక పోలీసు బృందాలను, మహిళా పోలీసులను పిలిపించారు. మధ్యాహ్నం మూడు గంటల తర్వత రూరల్ సీఐ గాంధీనాయక్ విద్యార్థులతో చర్చలు జరిపారు. వీసీ చాంబర్‌కు తాళం వేయడం నేరమని సర్దిచెప్పి, తీయించారు. దాంతో ఆందోళన విరమించారు. టూ టౌన్ సీఐ స్వామి గౌడ్, వన్ టూన్ సీఐ భీమ్‌కుమార్, ట్రాఫిక్ సీఐ శ్రీనువాస్‌లు, రూరల్ ఎస్ఐ విజయ్‌కుమార్ బందోబస్తులో పాల్గొన్నారు.

అసత్య ప్రచారం మానుకోవాలి : వీసీ

ఏబీవీపీ విద్యార్థులు హాస్టల్స్‌లో సమస్యలు ఉన్నాయని, మౌలిక వసతులు లేవనే అసత్య ప్రచారాలు మానుకోవాలని పీయూ వీసీ లక్ష్మీకాంత్ రాథోడ్ అన్నారు. విద్యార్థులు ధర్నా విరమించాక ఆయన మీడియాతో మాట్లాడారు. కొందరు విద్యార్థులు పబ్లిసిటీ కోసం లేని సమస్యలను సృష్టించి వర్సిటీని, అధికారులను బద్నాం చేస్తున్నారన్నారు. హాస్టల్ నిర్మాణంలో కాంట్రాక్టర్లు జాప్యం చేస్తున్నారని, ఆలస్యానికి నోటీసులు ఇచ్చామని, ఇంజనీరింగ్ విభాగానికి ఫిర్యాదు కూడా చేశామని చెప్పారు. ప్రభుత్వం చేసే పని కూడా తమను చేయాలనడం సరికాదన్నారు. విద్యార్థుల సమస్యలపై పోరాటాలు సరైనవే అయినా, ఆధారాలు లేకుండా వారి సంస్థల పిలుపు మేరకు ఆందోళన చేసి తమను ఇబ్బంది పెట్టడం మంచి పద్ధతి కాదన్నారు. కార్యక్రమంలో ఓఎస్‌డీ డాక్టర్ మధుసూదన్, రెడ్డి, పీజీ ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రకిరణ్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణయ్య పాల్గొన్నారు.



నిరుపయోగంగా ఉన్న సమీకృత మార్కెట్



రోడ్డు పక్కన చేపలు విక్రయిస్తున్న వ్యాపారులు

నిర్మించినా.. నిరుపయోగం

- అయిజలో సమీకృత మార్కెట్ దుకాణాలకు వేలం వేయని అధికారులు
- రోడ్డు అంచున వ్యాపారాలతో ఇబ్బందులు
- ఎండ, వాన.. ట్రాఫిక్ సమస్యలతో అవస్థ

అయిజ టౌన్, ఫిబ్రవరి 7: జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ పట్టణంలోని సమీకృత మార్కెట్ నిర్మాణం పూర్తయినా బహిరంగ వేలం నిర్వహించక వీధి వ్యాపారులు అవస్థలు పడుతున్నారు. రూ.కోటీ 50 లక్షలతో మార్కెట్ నిర్మాణం, రూ.70 లక్షలతో పరిసర ప్రాంత అభివృద్ధికి ఖర్చు చేసి పనులు పూర్తి చేశారు. గత ఏడాది అక్టోబరు ఐదో తేదీన వ్యవసాయ శాఖ మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి మార్కెట్‌ను ప్రారంభించారు. సమీకృత మార్కెట్ కావడం వల్ల అన్నిరకాల వస్తువులు ఒకేచోట దొరుకుతాయని ప్రజలు ఆశించారు. కానీ షాపులకు వేలం నిర్వహించకపోవడంతో కొత్త బస్టాండ్ నుంచి పాత బస్టాండ్ వరకు ప్రధాన రోడ్డుకు ఇరువైపులా కూరగాయలు, మాంసము, చేపలను విక్రయిస్తున్నారు. ఎండ, వాన, దుమ్ము ధూళితో వ్యాపారులు అనారోగ్యాల బారిన పడుతున్నారు. రోడ్డు అంచున ఉన్న దుకాణదారులు రోడ్డుపై వ్యాపారాలు చేసుకునే తమ నుంచి కిరాయి వసూలు చేస్తున్నారని చిరు వ్యాపారులు వాపోతున్నారు. మరోవైపు కోళ్లు, గొర్రెలు, చేపలను రోడ్లపైనే కోసి, వ్యర్థాలు డ్రైనేజీలో వేయడంతో భరించలేని దుర్వాసన వస్తోంది. ఉన్నతాధికారులు, నాయకులు నిర్లక్ష్యం వీడి దుకాణాలకు వేలం నిర్వహించాలని వ్యాపారులు, ప్రజలు కోరుతున్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డ



సమీకృత మార్కెట్ రాత్రి వేళ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. వేలం వేస్తే అన్ని రకాల వస్తువులు ఒకే చోట దొరుకుతాయి. రోడ్డుపై వ్యాపారం చేసుకునే వారికి మాత్రమే దుకాణాలు ఇవ్వాలి. అధికారులు, నాయకులు స్పందించి ప్రారంభించాలి.

- ఆంజనేయులు, ఎంఆర్‌పీఎస్ నాయకుడు

త్వరలో వేలం నిర్వహిస్తాం



సమీకృత మార్కెట్‌లో దుకాణాలకు త్వరలో బహిరంగ వేలం నిర్వహిస్తాం. అనివార్య కారణాల వల్ల ఆలస్యమైంది. ఉన్నతాధికారులు కూడా వేలం వేసేందుకు పరిశీలిస్తున్నారు. వీధి వ్యాపారులకు వీలైనంత త్వరలో దుకాణాలను అప్పగిస్తాం.

- ఏఈ గోపాల్, అయిజ

రోడ్లపై ఇబ్బంది

రోడ్లపై వ్యాపారాలు చేస్తుండటంతో వానకు, ఎండకు, దుమ్ము ధూళికి ఇబ్బందులు పడుతున్నాం. ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి. తమ దుకాణాల ముందు వ్యాపారాలు చేయొద్దని దుకాణదారులు అంటున్నారు. దుకాణాలకు వేలం నిర్వహించి మాకు న్యాయం చేయాలి.

- బోయ నర్సింహులు, కూరగాయల వ్యాపారి

రోడ్డెక్కిన విద్యార్థులు



పాఠశాల వద్ద ఖాళీ పేట్లతో నిరసన తెలుపుతున్న విద్యార్థులు

- మెనూ అమలు చేయడం లేదని మార్లబీడు గురుకుల విద్యార్థుల ఆవేదన
- కాలినడకన కలెక్టరేట్‌కు బయల్దేరిన స్టూడెంట్స్
- బూరెడ్డిపల్లి వద్ద ఎస్ఐల హామీతో విరమణ

ధరూరు, ఫిబ్రవరి 7: మెనూ అమలు చేయడం లేదని, నాణ్యతలేని భోజనం అందిస్తున్నారని ధరూరు మండలం మార్లబీడు గ్రామ గురుకుల పాఠశాల విద్యార్థులు బుధవారం పాఠశాల వద్ద ధర్నా చేశారు. అనంతరం విషయాన్ని కలెక్టర్‌కు చెబుతామని గద్వాలకు కాలినడకన బయల్దేరారు. పాఠశాలలో ఆరో తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులు చదువుకుంటున్నారు. చిట్యాల నుంచి వచ్చిన ఇంటర్ విద్యార్థులను కలుపుకొని దాదాపు 400 మంది ఉన్నారు. ఇంటర్ విద్యార్థులతో పాటు పాఠశాలలోని విద్యార్థులు దాదాపు 100 మంది నిరసనలో పాల్గొన్నారు. పాఠశాల సిబ్బంది అడ్డుకుని, ఇక నుంచి మెనూ ప్రకారం పెడతామని చెప్పినా ఆగలేదు. దాంతో సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. ధరూరు ఎస్ఐ విజయ్‌కుమార్, గట్టు ఎస్ఐ రామకృష్ణ ధరూరు గ్రామ శివారులో విద్యార్థులను ఆపి, వారితో మాట్లాడారు. నచ్చెజెప్పే ప్రయత్నం చేయగా, విద్యార్థులు అక్కడే నిరసనకు దిగారు. తర్వాత మళ్లీ ముందుకు కదిలారు. బూరెడ్డిపల్లి వరకు చేరుకోగా ఎస్ఐలు వారితో చర్చించారు. అక్కడి నుంచే ఎస్ఐలు డీసీవోకు ఫోన్‌లో విషయాన్ని చెప్పారు. డీసీవో కలెక్టర్‌కు తెలుపగా, మెనూ ప్రకారం భోజనం అందించాలని, సమస్య పరిష్కరించాలని కలెక్టర్ చెప్పారు. దాంతో విద్యార్థులు నిరసన విరమించారు. అక్కడి నుంచి వారిని ఆటోల్లో పాఠశాలకు తీసుకెళ్లారు.



కలెక్టరేట్‌కు కాలినడకన వెళ్తున్న విద్యార్థులు

పీఎంశ్రీకి 12 పాఠశాలలు ఎంపిక

- సంవత్సరానికి రూ.99,932 చొప్పున నిధులు
- రానున్న ఐదేళ్ల పాటు ఇంతే మొత్తంలో నిధులు విడుదల

నారాయణపేట, ఫిబ్రవరి 7 : ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేసి, పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎం శ్రీ) పథకానికి శ్రీకారం చుట్టింది. 2022-23 నుంచి 2026-27 వరకు ఐదేళ్ల పాటు కొనసాగే ఈ పథకంలో భాగంగా విడతల వారిగా మౌలిక వసతుల కల్పనకు నిధులు వెచ్చించనున్నారు. ఎంపికైన పాఠశాలలో ఆధునిక పద్ధతులతో విద్యా బోధన, డిజిటల్ విద్య అమలుతో పాటు సాంకేతిక పరికరాలను అందించనున్నారు. నారాయణపేట జిల్లా వ్యాప్తంగా ఈ పథకానికి 151 పాఠశాలలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా, 12 పాఠశాలలను ఎంపిక చేశారు. నారాయణపేట మండలం కోటకొండ జడ్పీహెచ్ఎస్, మద్దూర్ మండలం పెదిరిపాడ్, మక్తల్ బాయ్స్ స్కూల్, మాగనూర్ మండలం కున్సి, ఊట్కూర్ బాలికల, మక్తల మండలం వడ్వాట్, జక్లేర్, నర్వ మండలం పెద్ద కడ్మూర్, గుండుమల్ మోడల్ స్కూల్, ట్రైబల్ వెల్ఫేర్ కొండాపూర్, మరికల్ గురుకుల పాఠశాలలు ఎంపిక కావడంతో ఆయా పాఠశాలలో మౌలిక వసతులు కల్పించి ఆదర్శంగా తీర్చిదిద్దుతారు. గత విద్యా సంవత్సరమే ఎంపికైనా ఈ విద్యా సంవత్సరంలో నిధులు మంజూరయ్యాయి. ఎంపికైన ఒక్కో పాఠశాలకు రూ.99,932 మంజూరు కాగా, మొత్తం రూ.11,99,184 నిధులు విడుదల అయ్యాయి. అలాగే ఈ పాఠశాలలో విద్యార్థులకు కరాటే శిక్షణ ఇచ్చేందుకు ఒక్కో పాఠశాలకు రూ.15 వేలు చొప్పున మొత్తం రూ.1.80 లక్షలు మంజూరయ్యాయి. కార్పొరేట్ స్థాయిలో మెరుగైన విద్యను అందించడంతో పాటు సర్వతో ముఖాభివృద్ధికి క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. సౌర విద్యుత్‌ను అందుబాటులోకి తీసుకొచ్చి అన్ని తరగతుల్లో ఎల్ఈడీ దీపాలు ఏర్పాటు చేస్తారు. విద్యార్థులకు పోషకాహారం అందేలా పాఠశాల ఆవరణలో తోటలు పెంచుతారు. నీటి వనరుల సంరక్షణ, పర్యావరణ పరిరక్షణతో పాటు బొమ్మలతో విద్యార్థులను ఆకట్టుకుంటూ బోధిస్తారు. కాగా గతనెల 23న స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలు రద్దు కావడంతో కొత్త కమిటీల ఎన్నిక తర్వాతే మంజూరైన నిధులను వినియోగించుకునే అవకాశం ఉంది.



మక్తల్ జడ్పీహెచ్ఎస్

జలవిద్యుత్ కేంద్రాన్ని సందర్శించిన

బిహార్ ఎమ్మెల్యేలు



శ్రీశైలం ఎడమ గట్టు జలవిద్యుత్ కేంద్రంలో బిహార్ ఎమ్మెల్యేల బృందం

దోమలపెంట, ఫిబ్రవరి 7 : ఆంధ్ర- తెలంగాణ సరిహద్దులోని నాగర్‌కర్నూలు జిల్లా శ్రీశైలం ఎడమ గట్టు భూగర్భ జలవిద్యుత్ కేంద్రాన్ని బుధవారం అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అధ్వర్యంలో 17 మంది బిహార్ ఎమ్మెల్యేల బృందం సందర్శించింది. వారికి జలవిద్యుత్ కేంద్రం పనితీరును జెన్‌కో సీఈ సూర్యనారాయణ వివరించారు. ఇంతటి అద్భుతమైన విద్యుత్ కేంద్రం తెలంగాణలో ఉండటం దేశానికే గర్వకారణమని బిహార్ ఎమ్మెల్యేల బృందం కొనియాడింది. విద్యుత్ కేంద్రం సాంకేతిక అంశాలను వారికి ఇంజనీర్లు వివరించారు. అంతకు ముందు శ్రీశైలం మల్లికార్జున స్వామిని వారు దర్శించుకున్నారు. దేవస్థానం సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో దోమలపెంట ఎంపీటీసీ సభ్యుడు మల్లికార్జున్, నాయకులు ఉన్నారు.

ఉల్లి రైతులకు నిరాశ

» గరిష్ఠంగా రూ.1600
» కనిష్ఠంగా రూ.1000


దేవరకద్ర మార్కెట్‌యార్డుకు తీసుకువచ్చిన ఉల్లిగడ్డ రాసులు

దేవరకద్ర, ఫిబ్రవరి 7 : మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మార్కెట్‌యార్డుకు బుధవారం ఉల్లి పోటెత్తింది. దేవరకద్ర మండలంలోని వివిధ గ్రామాల్లో రైతులు పండించిన ఉల్లిని విక్రయించేందుకు వ్యవసాయ మార్కెట్ యార్డుకు తీసుకొచ్చారు. మార్కెట్‌లో జరిగిన లావాదేవీల్లో ఉల్లి ధరలు రోజురోజుకు తగ్గుముఖం పడుతున్నాయి. బుధవారం వ్యాపారులు నిర్వహించిన వేలంలో గరిష్ఠంగా రూ.1610, కనిష్ఠంగా రూ.750 ధర పలికినట్లు మార్కెట్ సెక్రటరీ ఎల్లయ్య తెలిపారు. మార్కెట్‌కు వచ్చిన ఉల్లిలో తెల్లగా, నాణ్యంగా ఉన్న వాటికి కొంతవరకు డిమాండ్ ఉండగా, ఇక ఎర్ర ఉల్లిని కొనేవారు కరువయ్యారు. విత్తనాలు కొనే సమయంలో ఉల్లి రకం ఎలా ఉంటుందో తెలియని రైతులు దిగుబడులు వచ్చాక నెత్తిన చేతులు పెట్టుకుంటున్నారు. వ్యాపారులు, చిరు వ్యాపారులు ఎక్కువగా ఎర్ర ఉల్లిని కొనుగోలు చేశారు. మార్కెట్‌కు 285 క్వింటాళ్ల ఉల్లి అమ్మకానికి వచ్చినట్లు ఎల్లయ్య తెలిపారు.

పెరిగిన దిగుమతులు

కర్నూల్, హైదరాబాద్ మార్కెట్‌లకు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి వందలాది లారీల్లో ఉల్లి వచ్చిందని, దిగుమతులు అధికంగా వచ్చిన కారణంగా ధరలు పడి పోయాయని వ్యాపారులు అంటున్నారు. బయట నుంచి వచ్చే ఉల్లి ధర కన్నా మన మార్కెట్‌లో రూ.200 నుంచి రూ.300 వరకు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. ఎక్కువగా ఎర్ర ఉల్లిని పండించిన కారణంగా ధరలు రావడం లేదన్నారు. తెల్ల ఉల్లికి కొంతవరకు డిమాండ్ ఉంది. దీనివల్ల ధరలు తగ్గుతున్నాయి.

సైబర్ నేరాలకు పాల్పడిన ముగ్గురి రిమాండ్

గద్వాల క్రైం, ఫిబ్రవరి 7 : సైబర్ నేరాలకు పాల్పడిన ముగ్గురు నేరస్తులపై పీటి వారెంట్ అమలు చేయడంతో పాటు, వారిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ రితిరాజ్ బుధవారం తెలిపారు. ఇందుకు సంబంధించి ఎస్పీ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో కొందరికి ఫోన్ చేసి క్రెడిట్ కార్డు లిమిట్ పెంచుకోవాలని లింక్ పంపి దానిని క్లిక్ చేసి ఓటీపీ వివరాలను అడిగి అనంతరం మూడు దశల్లో రూ.24,500 దోచుకున్నారు. మరొక కేసులో ఇన్‌స్టాగ్రామ్‌లో తక్కువ రేట్‌కు మొబైల్స్ అమ్ముతామని, ఆర్మీ వాళ్లమంటూ యాడ్స్ ఇవ్వగా వారికి బాధితుడు కాల్ చేసి వివరాలు అడిగాడు. దీంతో వారు కొరియర్, ఇతర చార్జీల కింద రూ.8,100లను వారి ఖాతాలోకి వేసుకున్నారు. బాధితుల ఫిర్యాదుపై ఐటీ యాక్ట్ కింద కేసులు నమోదు చేసి జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన జమ్మద్దీన్ అన్సారి, రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన మహిర్‌అజాద్, వకీల్‌లను అదుపులోకి తీసుకున్నామన్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో నిందితులను గుర్తించి డబ్బులు మార్పిడి జరిగిన అకౌంట్స్, ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులకు రిమాండ్ విధించగా, మహబూబ్‌నగర్ జైలుకు తరలించినట్లు ఎస్పీ తెలిపారు. సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, బ్లూ లింక్ మెసేజ్‌లను ఓపెన్ చేయొద్దని, ఎవరికీ ఓటీపీలు చెప్పొద్దని ఎస్పీ సూచించారు. ఏదైనా సైబర్ నేరం జరిగినట్లయితే వెంటనే 1930కు కాల్ చేయాలని ఆమె సూచించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 7 : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్‌కు చెందిన లాలన్‌యాదవ్(51), అతని కుమారుడు సతీష్‌యాదవ్‌లు కొన్నాళ్ల క్రితం ఉపాధి కోసం భూత్పూర్ పక్కనే ఉన్న పోతులమడుగు రైస్‌మిల్‌లో పని చేస్తున్నారు. బుధవారం లాలన్‌యాదవ్ మిల్లుకు చెందిన ద్విచక్ర వాహనంపై పట్టణానికి వచ్చి పని ముగించుకుని వెళుతుండగా పాతపాలమూరు దగ్గర మరమ్మతు జరుగుతున్న బ్రిడ్జి వద్ద వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొట్టింది. ప్రమాదంలో లాలన్‌యాదవ్ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని జనరల్ ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుమారుడు సతీష్ యాదవ్ వన్‌టౌన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై సుధామాధురి లారీ డ్రైవర్ కుర్వ యాదయ్యపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్యాయత్నం

ఊర్కొండ, ఫిబ్రవరి 7 : పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్యాయత్నం చేసుకున్న ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ఆంజనేయులు(అంజి) బుధవారం తన ఇంట్లో పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉండగా గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అంజి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని, పరిస్థితి మెరుగ్గానే ఉందని వైద్యులు తెలిపినట్లు కుటుంబీకులు తెలిపారు. అంజి ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

అమరచింత, ఫిబ్రవరి 7 : హైదరాబాద్‌లో అన్నదమ్ముల మధ్య జరిగిన ఘర్షణలో తీవ్రంగా గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. వనపర్తి జిల్లా అమరచింతకు చెందిన ప్రేమయ్య, మార్తమ్మల కుమారుడు ప్రవీణ్ అలియాస్ మోసెస్(19) హైదరాబాద్‌లోని మధురానగర్‌లో సమీప బంధువుల ఇంట్లో ఉంటూ ప్రైవేటు పని చేసుకుంటూ ఉండేవాడు. ఈనెల ఐదో తేదీన ప్రవీణ్ ఉంటున్న ఇంట్లో చిన్నపాటి గొడవతో అన్నదమ్ముల మధ్య ఘర్షణకు దారి తీసింది. అప్పుడే ఇంట్లోకి వెళ్లిన ప్రవీణ్ ఆ గొడవను ఆపే ప్రయత్నం చేశాడు. దీంతో మధ్యలో వెళ్లిన ప్రవీణ్‌కు కత్తిపోటుతో తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం దగ్గరలో ఉన్న ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఈనెల ఆరో తేదీన మృతి చెందాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు అక్కడి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది.

అమరచింతలో అంత్యక్రియలు

హైదరాబాద్‌లో మృతి చెందిన ప్రవీణ్ అంత్యక్రియలు బుధవారం అమరచింతలో జరిగాయి. మృతి చెందిన యువకుడు కాంగ్రెస్ కార్యకర్త సమీప బంధువు కావడంతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి స్మశానవాటికకు వెళ్లి అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లో అన్ని వసతులు కల్పించాలి

- ఎస్ఎఫ్ఐ జాతీయ నాయకురాలు మమత

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఫిబ్రవరి 7 : ప్రభుత్వం అమ్మాయిలకు సంబంధించిన చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థినులకు సరిపడా వసతులు కల్పించాలని ఎస్ఎఫ్ఐ జాతీయ నాయకురాలు మమత అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రశాంత్ అధ్యక్షతన సంఘం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థినులకు అన్నివిధాలా మెడికల్ కిట్లు పంపిణీ చేయాలని కోరారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందజేయాలన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే రాష్ట్రంలోని అన్ని జిల్లా కలెక్టరేట్ల ముందు ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యదర్శి ప్రశాంత్ మాట్లాడుతూ విద్యార్థులకు రావాల్సిన మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు.

అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా గర్ల్ కమిటీని ఎన్నుకున్నారు. 17 మందితో జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. ఆరుగురు ఆఫీస్ బేరర్స్‌ను ఎన్నుకున్నారు. జిల్లా గర్ల్స్ కన్వీనర్‌గా రాధిక, కో-కన్వీనర్‌గా రమాదేవి, ప్రసన్న, శిరీష, సరిత, రాధాను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు భరత్, నాయకులు ఈశ్వర్, నందు, రాము, శ్రీధర్ పాల్గొన్నారు.

వైభవంగా అంజన్న బ్రహ్మోత్సవాలు

- ఒంటె వాహనంపై ఊరేగిన స్వామివారు
- భక్తుల రద్దీ
- జైహనుమాన్ నామస్మరణతో మారుమోగిన ఆలయ పరిసరాలు


గాజుల దుకాణం వద్ద మహిళల రద్దీ


ఎండ వేడిమిని తాళలేక సోడాలు తాగుతున్న భక్తులు

ఊర్కొండ, ఫిబ్రవరి 7 : నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలం ఊర్కొండపేట శ్రీఅభయాంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం ఐదవ రోజు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. తెల్లవారుజామున అర్చకులు సుప్రభాత సేవ, మంగళహారతులతో ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవమూర్తులకు పంచామృతాభిషేకం, అష్టోత్తర పూజలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులను చెల్లించుకున్నారు. రాత్రి స్వామివారు ఒంటె వాహనంపై ఊరేగారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు ఆలయ ఆవరణలో వెలసిన దుకాణాల్లో మిఠాయి, గాజులు, చిన్నపిల్లల ఆట వస్తువులు కొనుగోలు చేస్తుండటంతో వ్యాపారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కార్యనిర్వహణాధికారి సత్యచంద్రారెడ్డి, పాలక మండలి సభ్యులు మనోహర్‌రెడ్డి, నర్సిరెడ్డి, రమేష్‌నాయక్, గోపాల్, అశోక్, సంగప్పగౌడ్, అంజయ్యగౌడ్ జాగ్రత్తలు తీసుకున్నారు. ఆలయ సిబ్బంది శ్రీనివాస్‌రెడ్డి, వరలక్ష్మీ, శ్రీశైలం, రవికుమార్, అర్చకులు దత్తాత్రేయశర్మ, శ్రీనివాస్‌శర్మ, ప్రవీణ్‌శర్మ, మహేష్ శర్మ, భక్తులు పాల్గొన్నారు.


ఒంటె వాహనంపై ఊరేగుతున్న అభయాంజనేయస్వామి

పార్లమెంట్ ఎన్నికల్లో

ముదిరాజ్‌లకు సముచిత స్థానం కల్పించాలి

- ముదిరాజ్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జగన్‌మోహన్
- కొల్లాపూర్‌లో తెనుగు తెలుగు ముదిరాజ్ ఆత్మీయ సమ్మేళనం


ముదిరాజ్ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న జగన్‌మోహన్, హైకోర్టు న్యాయవాది డీఎల్.పాండు

కొల్లాపూర్, ఫిబ్రవరి 7 : త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం తెనుగు తెలుగు ముదిరాజ్‌లకు రాజకీయపరంగా సముచిత స్థానం కల్పించాలని ముదిరాజ్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జగన్‌మోహన్ కోరారు. బుధవారం కొల్లాపూర్ పట్టణంలోని మహబూబ్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన తెనుగు తెలుగు ముదిరాజ్ ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. మాజీ వైస్ ఎంపీపీ బయ్యా వెంకటస్వామి అధ్యక్షతన కొనసాగిన ముదిరాజ్ ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్య అతిథులుగా జగన్‌మోహన్‌తో పాటు, హైకోర్టు న్యాయవాది డీఎల్.పాండు, తెలంగాణ కాంగ్రెస్ కమిటీ జనరల్ సెక్రటరీ సంజీవ్ ముదిరాజ్, జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు నిరంజన్, కళాకారుడు బిత్తిరి సత్తిలు పాల్గొన్నారు. ఆత్మీయ సమ్మేళనంలో జగన్‌మోహన్ మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం ముదిరాజ్‌లను పట్టించుకోలేదని, తెనుగు తెలుగు ముదిరాజ్‌లంతా ఏకమై కేసీఆర్‌ను గద్దె దించామని, పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ముదిరాజ్‌లకు సముచిత స్థానం కల్పించకపోతే తమ సత్తా చూపిస్తామని అన్నారు. తెనుగు తెలుగు ముదిరాజ్ మత్స్యకారులను బీసీ డీ నుంచి బీసీ ఏలోకి కలపాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైకోర్టు న్యాయవాది డీఎల్.పాండు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ముదిరాజ్‌ల జనాభా ఎక్కువగా ఉందని జనాభా ప్రాతిపదికన కాంగ్రెస్ ప్రభుత్వం ముదిరాజ్‌లకు అన్ని రంగాల్లో సముచిత స్థానం కల్పించాలని, ముదిరాజ్‌లు కలిసికట్టుగా ఐకమత్యంతో రాజ్యాధికారం కోసం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ముదిరాజ్ ఉద్యోగుల సాంస్కృతిక సమైక్య సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు జూపల్లి రవీందర్, మత్స్యకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు వాకిటి ఆంజనేయులు, ముదిరాజ్ ఉద్యోగుల సంఘం జనరల్ సెక్రటరీ కుమారస్వామి, వికారాబాద్ జాయింట్ కలెక్టర్ అరుణ, కోట్ల నీరజ, రమాదేవి, శ్రీలత, నాయకులు మధు, ప్రేమ్‌జిత్ తదితరులు పాల్గొన్నారు.

భూత్పూర్ పీహెచ్‌సీ తనిఖీ

- పీహెచ్‌సీలు ఇక నుంచి ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు
- ఆరోగ్య శాఖ రాష్ట్ర కోఆర్డినేటర్ శ్రీనివాసులు

భూత్పూర్, ఫిబ్రవరి 7 : మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండల కేంద్రంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆరోగ్య శాఖ రాష్ట్ర కోఆర్డినేటర్ శ్రీనివాసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన దవాఖానాలో ఉన్న రికార్డులను పరిశీలించారు. అదేవిధంగా ఆరోగ్య కేంద్రంలో ఉన్న వివిధ వార్డులను పరిశీలించారు. ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఇకనుంచి ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలుగా పేరును మార్చినట్లు తెలిపారు. అనంతరం ఆయన మండలంలోని అన్నాసాగర్ ఉప కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రోగులతో ఆయన మాట్లాడారు. రోగులకు ప్రభుత్వ దవాఖానాలపై నమ్మకం ఉండేలా వైద్య సేవలను అందించాలని సూచించారు. ఈయన వెంట మండల వైద్యాధికారి డాక్టర్ అబ్దుల్‌రబ్, సీహెచ్‌వో అయూబ్‌ఖాన్, వైద్య సిబ్బంది ఉన్నారు.


భూత్పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రికార్డులను తనిఖీ చేస్తున్న రాష్ట్ర కోఆర్డినేటర్ శ్రీనివాసులు

నవోదయ ప్రవేశ పరీక్ష సజావుగా నిర్వహించాలి

- నవోదయ ప్రిన్సిపాల్ పి.భాస్కర్‌కుమార్

బిజినేపల్లి, ఫిబ్రవరి 7 : జవహర్ నవోదయ విద్యాలయంలో తొమ్మిదవ, 11వ తరగతి ప్రవేశాల కోసం ఈనెల 10న నిర్వహించనున్న పరీక్ష సజావుగా నిర్వహించాలని విద్యాలయం ప్రిన్సిపాల్ పి.భాస్కర్‌కుమార్ అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని వట్టెం జవహర్ నవోదయ విద్యాలయంలో బుధవారం పరీక్ష కేంద్రాల పర్యవేక్షకులతో పరీక్షల నిర్వహణపై శిక్షణ కార్యక్రమం చేపట్టి మాట్లాడారు. తొమ్మిదవ తరగతి ప్రవేశ పరీక్ష నిర్వహణకు ఏడు కేంద్రాలు ఏర్పాటు చేయగా 1,704 మంది విద్యార్థులు, అలాగే 11వ తరగతి ప్రవేశపరీక్ష నిర్వహణకు ఏడు కేంద్రాలు ఏర్పాటు చేయగా 2,041 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నట్లు తెలిపారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో పరీక్షల నిర్వహణ అధికారి భాస్కరాచారి, ఎంఈవో భాస్కర్‌రెడ్డి తదితరులున్నారు.


వట్టెం జవహర్ నవోదయలో పరిశీలకులనుద్దేశించి మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ పి.భాస్కర్‌కుమార్

నెమలి అప్పగింత

నవాబ్‌పేట, ఫిబ్రవరి 7 : మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం కామారం గ్రామంలో పొలాల మధ్య నడవలేని స్థితిలో ఉన్న ఓ నెమలిని పట్టుకొని పోలీసులకు అప్పగించారు. గ్రామంలోని పంట పొలాల మధ్య బుధవారం లేవలేని స్థితిలో ఉన్న నెమలిని గుర్తించిన రైతు లక్ష్మయ్య దానిని పట్టుకొని పరిశీలించాడు. నెమలి గాయాలపాలు కావడంతో వెంటనే దానిని పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్సై సురేష్‌బాబుకు అప్పగించారు. దీంతో ఆయన అటవీశాఖ అధికారులు లక్ష్మన్, రమేష్‌లను పిలిచి వారికి అప్పగించారు. అటవీ అధికారులు నెమలిని జిల్లా కేంద్రం సమీపంలోని పిల్లలమర్రి అడవికి తరలించినట్లు సమాచారం.


నెమలిని అప్పగిస్తున్న అధికారులు

అదుపు తప్పిన కారు

ఊర్కొండ, ఫిబ్రవరి 7 : కారు అదుపు తప్పిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలంలోని ఊర్కొండపేట శివారులో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఊర్కొండపేట అభయాంజనేయస్వామివారిని దర్శించుకొని తిరిగి స్వగ్రామం వెళ్తున్న క్రమంలో మేకలు అడ్డు రావడంతో తప్పించే యత్నంలో కారు అదుపు తప్పి రోడ్డు పక్కకు వెళ్లింది. కారులో ఊర్కొండకు చెందిన ఇద్దరు వ్యక్తులు ఉండగా వారికి ఎలాంటి గాయాలు కాలేదు.

స్టీరింగ్ పనిచేయక బోల్తా పడిన కారు..

మక్తల్ : స్టీరింగ్ పనిచేయక కారు బోల్తా పడిన సంఘటన నారాయణపేట జిల్లా మక్తల్ మండలం బొందల్‌కుంట స్టేజీ సమీపంలో చోటు చేసుకుంది. ఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. ఇటుకల బట్టీ యజమాని చంద్రబాబు సోదరుడు శివ బుధవారం సాయంత్రం మక్తల్ నుంచి జక్లేర్‌కు కారులో బయలుదేరాడు. బొందల్‌కుంట స్టేజీ సమీపంలో కారు స్టీరింగ్ పనిచేయక పోవడంతో జాతీయ రహదారి పైనుంచి వ్యవసాయ పొలంలోకి దూసుకుపోయింది. ఈ క్రమంలో బెలూన్స్ ఓపెన్ కావడంతో ప్రమాదం తప్పింది. ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.


ఊర్కొండ-ఊర్కొండపేట రోడ్డులో అదుపు తప్పిన కారు

యువతి అదృశ్యం

జడ్చర్ల, ఫిబ్రవరి 7 : ఇంటి నుంచి బయటికి వెళ్లిన యువతి అదృశ్యమైన సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో చోటు చేసుకుంది. ఎస్సై చంద్రమోహన్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన ఓ యువతి టైలరింగ్ పనులు చేస్తోంది. ఈనెల ఐదో తేదీన టైలరింగ్ పనుల కోసమని వెళ్లి ఇంటికి తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన తల్లి బంధువులు, స్నేహితుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. బుధవారం తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దొంగతనం కేసులో వ్యక్తి అరెస్టు

ఆత్మకూరు, ఫిబ్రవరి 7 : దొంగతనం కేసులో ఓ వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆత్మకూరు సీఐ శివకుమార్, ఎస్సై నరేందర్‌లు తెలిపారు. వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలం పిన్నంచర్ల గ్రామంలో 2022 నవంబర్ నెలలో ఆంజనేయస్వామి విగ్రహానికి ఉన్న వెండి కిరీటం, వెండి గద, వెండి ఆకులమాల, చట్టి గోపురం పోయిందని ఆత్మకూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైంది. కాగా ఆత్మకూరు ఆర్టీసీ బస్టాండ్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించగా వికారాబాద్ జిల్లా దోమ మండలం బడంపల్లి గ్రామానికి చెందిన అంజలయ్య ఆంజనేయ స్వామి ఆలయంలో దొంగతనం చేసింది తానేనని ఒప్పుకున్నట్లు వారు తెలిపారు. నిందితుడి నుంచి స్వామివారి ఆభరణాలను స్వాధీనం చేసుకుని ఆత్మకూరు జూనియర్ సివిల్ కోర్టులో హాజరుపర్చగా 14 రోజుల రిమాండ్ విధించినట్లు వారు తెలిపారు. కాగా, ఇతనిపై వికారాబాద్, నారాయణపేట జిల్లాలోని ఆయా మండలాల పోలీస్‌స్టేషన్‌లో 19 కేసులు ఉన్నాయని, అలాగే అమరచింత మండలంలో కూడా ఇదివరకే ఇతనిపై కేసు నమోదైందని వివరించారు.

గడ్డివాము, వేరుశనగ పొట్టు దగ్ధం

- రూ.50వేల ఆస్తి నష్టం


అగ్ని ప్రమాదంలో దగ్ధమవుతున్న గడ్డివాము

లింగాల, ఫిబ్రవరి 7 : నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలం అంబట్‌పల్లి గ్రామంలో బుధవారం గడ్డివాము, వేరుశనగ పొట్టు దగ్ధమైంది. గ్రామ సమీపంలోని వ్యవసాయ పొలంలో ఎన్నచెర్ల పుల్లయ్య, వెంకటయ్య అనే రైతులు నిల్వ ఉంచిన గడ్డివాములకు ప్రమాదవశాత్తు నిప్పంటుకుంది. ప్రమాదంలో నాలుగు ఎకరాలకు సంబంధించిన వేరుశనగ పొట్టు, రెండు ఎకరాల గడ్డి పూర్తిగా కాలిపోయిందని బాధిత రైతులు వాపోయారు. ప్రమాదంలో రూ.50 వేల ఆస్తి నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. గడ్డివాము దగ్ధంతో పశువులకు మేత కరువైందని వారు ఆందోళన వ్యక్తం చేశారు.

మద్యం పట్టివేత

జడ్చర్ల, ఫిబ్రవరి 7 : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం ఆలూరు గ్రామంలో ఎలాంటి అనుమతులు లేకుండా విక్రయిస్తున్న మద్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై చంద్రమోహన్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని తిరుమల దాబాలో అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తుండగా బ్లూకోర్ట్ పోలీసులు పట్టుకున్నారు. దాబాలో నిల్వ ఉంచిన రూ.20 వేల విలువ గల మద్యాన్ని స్వాధీనం చేసుకొని, దాబా యాజమాని తిరుపతయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కలప ట్రాక్టర్ పట్టివేత

మక్తల్, ఫిబ్రవరి 7 : టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిర్వహించిన దాడుల్లో కలప ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు అటవీశాఖ సెక్షన్ అధికారి నీలేష్ తెలిపారు. నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలం ఎడవెల్లికి చెందిన కృష్ణయ్య ట్రాక్టర్‌లో కలపను మక్తల్‌కు తరలిస్తుండగా పట్టణంలోని నల్లజానమ్మ ఆలయం సమీపంలో దాడులు నిర్వహించి పట్టుకున్నట్లు తెలిపారు. కలప ట్రాక్టర్‌ను మక్తల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఆయన పేర్కొన్నారు. ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు నీలేష్ తెలిపారు.

ఇసుకను తరలిస్తున్న ట్రాక్టరు..

కేటీదొడ్డి, ఫిబ్రవరి 7 : ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను జోగుళాంబ గద్వాల జిల్లా కేటీదొడ్డి పోలీసులు పట్టుకున్నారు. బుధవారం మండలంలోని సర్వాపురం నుంచి కొండాపురం గ్రామానికి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తుండగా గ్రామ శివారులో పట్టుకున్నట్లు ఎస్సై శ్రీనివాసరావు తెలిపారు. వాహనానికి ఎలాంటి రిజిస్ట్రేషన్ లేకపోవడంతో డ్రైవర్ అయ్యప్పపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

షోరూం నుంచి కారు దొంగతనం

గద్వాల, ఫిబ్రవరి 7 : జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని ఓ షోరూంలో రీ సేల్ కోసం ఉంచిన కారు ఒకటి దొంగతనానికి గురైంది. గద్వాల రూరల్ ఎస్సై పర్వతాలు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని వీరభద్ర కారు షోరూంలో ఏపీ11 ఏటీ9703 నెంబర్ గల స్విఫ్ట్ కారును యజమాని రీసేల్ కోసం గ్యారేజీలో అప్పగించారు. గత ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కారును దొంగిలించారు. బుధవారం బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కొట్రలో గొర్రెలు చోరీ

వెల్దండ, ఫిబ్రవరి 7 : నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం కొట్ర గ్రామంలో గొర్రెలు అపహరణకు గురయ్యాయి. గ్రామంలో పుణ్యమూర్తి బాలస్వామి తన ఇంటి సమీపంలో దొడ్డిని ఏర్పాటుచేసుకొని గొర్రెలు ఉంచాడు. మంగళవారం రాత్రి గుర్తు తెలియని దొంగలు దొడ్డిలో ఉంచిన 11 గొర్రెలు, పొట్టేలును ఎత్తుకెళ్లారు. బుధవారం తెల్లవారుజామున గుర్తించిన బాలస్వామి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. చోరీకి గురైన గొర్రెల విలువ సుమారు లక్ష రూపాయలు ఉంటుందని బాధితుడు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

కల్వకుర్తి, ఫిబ్రవరి 7 : నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ ఆవరణలో పేకాట ఆడుతున్న ఆరుగురిని పోలీసులు పట్టుకున్నారు. పేకాటరాయుళ్ల నుంచి రూ.4,260 నగదును స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జి.మాధవరెడ్డి తెలిపారు.

శతాధిక వృద్ధురాలి మృతి


కౌసల్యమ్మ (ఫైల్)

వంగూరు, ఫిబ్రవరి 7 : నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరులో బుధవారం శతాధిక వృద్ధురాలు తెడ్లపల్లి కౌసల్యమ్మ(106) మృతి చెందింది. ఈమెకు నలుగురు కుమారులు, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, మాజీ మంత్రి చిత్తరంజన్‌దాస్, స్థానిక ప్రజాప్రతినిదులు, వివిధ పార్టీల నాయకులు వృద్ధురాలి అంత్యక్రియల్లో పాల్గొని నివాళి అర్పించారు.

యువత చేతిలోనే దేశ భవిష్యత్

» బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ



మాట్లాడుతున్న బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ

మద్దూర్/కొత్తపల్లి, ఫిబ్రవరి 7 : యువత చేతిలోనే దేశ భవిష్యత్ ఉందని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ అన్నారు. బుధవారం మద్దూర్‌లో జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ఆమె ప్రారంభించి, మాట్లాడారు. గ్రామ యువతలో దాగిఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ఇలాంటి క్రీడలు ఎంతగానో దోహదపడతాయన్నారు. నైపుణ్యం గల క్రీడాకారులు రాష్ట్ర, దేశ, అంతర్జాతీయ స్థాయిలో ఎదిగేందుకు తనవంతు ప్రోత్సాహం ఉంటుందన్నారు. దేశాన్ని 2040 వరకు ప్రపంచంలో మొదటి స్థానంలో నిలిపేందుకు ప్రధాని మోదీ వికసిత్ భారత్‌కు చేస్తున్న ప్రయత్నంలో యువత అండగా నిలువాని కోరారు. అంతకుముందు కొత్తపల్లి మండలం నిడ్జింత గ్రామంలో పర్యటించారు. జనరల్ సెక్రటరి రవిగౌడ్ నాన్న వెంకటయ్య అనారోగ్యంగా ఉన్నాడని తెలియగా ఇంటికెళ్లి పరామర్శించారు. కొత్తపల్లి మండలాధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, బీజేవైఎం అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, సెక్రటరి శేఖర్ పాల్గొన్నారు.

పారదర్శకంగా ఈవీఎంల తనిఖీ



ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

నారాయణపేట టౌన్, ఫిబ్రవరి 7 : జాతీయ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈవీఎం యంత్రాల మొదటి స్థాయి తనిఖీ పారదర్శకంగా ఇంజనీర్ల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎఫ్ఎల్‌సీ, ఈవీఎంలను భద్రపరచడం అంశాలపై బుధవారం కలెక్టర్ పరిశీలించి, మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా రాజకీయ పార్టీల సమక్షంలో ఈనెల 5 నుంచి 9వ తేదీ వరకు ఈసీఐఎల్ ఇంజనీర్ల బృందం ఆధ్వర్యంలో ఎఫ్ఎల్‌సీ, ఎన్నికల ఏర్పాట్లలో భాగంగా ఎఫ్ఎల్‌సీ నిర్వహణ, గోడౌన్‌లో ఈవీఎం బ్యాలెట్ యూనిట్, కంట్రోలింగ్ యూనిట్, వీవీ ప్యాట్ యంత్రాలను పరిశీలించారు. అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, ఆర్డీవో రాంచందర్ పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల ఏర్పాటుకు భవనాల పరిశీలన

కోస్గి రూరల్ , ఫిబ్రవరి 7 : డిగ్రీ కళాశాల ఏర్పాటుకు స్థానిక జూనియర్ కళాశాల భవనాన్ని బుధవారం కాడా అధికారి వెంకట్‌రెడ్డితో పాటు మండల నాయకులు పరిశీలించారు. పట్టణంలోని జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణాలతో పలు భవనాలను పరిశీలించారు. కోస్గి పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు భవనాలను పరిశీలిస్తున్నట్లు వారు తెలిపారు. ప్రభుత్వ సూచన మేరకు కొడంగల్ నియోజక వర్గంలో కోస్గి మండలం అన్ని మండలాలకు అనుకూలమైన స్థలం ఉండడంతో డిగ్రీ కళాశాల ఏర్పాటుకు అధికారులు మొగ్గు చూపుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

మాజీ సర్పంచులకు సన్మానం



మాజీ సర్పంచులను సన్మానించిన ప్రజాప్రతినిధులు

దామరగిద్ద, ఫిబ్రవరి 7 : ఐదు సంవత్సరాల కాలం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించిన సర్పంచుల రుణం తీర్చుకోలేనిదని ఎంపీపీ బక్క నర్సప్ప, వైస్ ఎంపీపీ దామోదర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో అన్ని గ్రామాల సర్పంచులను పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ కరోనా కష్ట కాలంలో సర్పంచులు ప్రజలకు అందుబాటులో ఉండి సేవా కార్యక్రమాలు చేపట్టారని, అలాగే గ్రామాల్లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి గ్రామాభివృద్ధికి తోడ్పాటు అందించారన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు లావణ్య ఎంపీడీవో శ్రీధర్, ఎంపీవో ఉదయ్‌కమార్‌తో పాటు ఆయా గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

పక్కాగా పారిశుధ్య పనులు చేపట్టాలి

మక్తల్, ఫిబ్రవరి 7 : మండండలోని అన్ని గ్రామాల్లో పక్కాగా పారిశుధ్య పనులు చేపట్టాలని ప్రత్యేకాధికారులు సద్గుణ, మిథున్‌చక్రవర్తి, రహమత్, మంగులాల్ అన్నారు. బుధవారం మండలంలోని గుడిగండ్ల, సంగంబండ, కర్నీ, మంథన్‌గోడ్, జక్లేర్, చిట్యాల, అనుగొండ గ్రామాల్లో పారిశుధ్యంపై కళాకారులతో ఆట పాటల ద్వారా అవగామన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ, అంగన్‌వాడీ, పాఠశాలతో పాటు ప్రభుత్వ కార్యాలయాలు పరిశుభ్రంగా ఉండాలన్నారు. తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయాలని, తాగునీటి సరఫరా నిలిచిపోతే ప్రత్యామ్నాయంగా సోర్సు బోర్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. 15వ తేదీ నుంచి గ్రామ సభలు నిర్వహించి పారిశుధ్య పనులు చేసే కార్మికులను సన్మానించాలన్నారు.

సరాఫ్ కృష్ణ మృతి తీరని లోటు

నారాయణపేట వైద్యవిభాగం, ఫిబ్రవరి 7 : సరాఫ్ కృష్ణ మృతి తీరనిలోటు అని బాలు ఫ్యాన్స్ రాష్ట్ర అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం బాల కేంద్రంలో సరాఫ్ కృష్ణ చిత్ర పటానికి బాలు అభిమాన సంఘం ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులకు సంప్రదాయ కళలను అందించాలనే తపనతో నారాయణపేటలో మొదటి సారిగా లలితా కళా నికేతన్‌ను స్థాపించి, 1983లో జవహర్ బాల కేంద్రాన్ని స్థాపించి నిర్విరామంగా కళలను అందించేందుకు కృషి చేసిన కళా తపస్వి ప్రముఖ కవి సరాఫ్ కృష్ణ అని కొనియాడారు. అంతకుముందు ఆయన ఆత్మశాంతికి రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో జీహెచ్ఎం గేణుగోపాల్, గాయకులు సంగ నర్సింహులు, వసంత్, రామకృష్ణ, జ్ఞానామృత, చిన్నారులు పాల్గొన్నారు.

కంప్యూటర్ విద్య ఎంతో అవసరం

మద్దూర్, ఫిబ్రవరి 7 : నేటి సమాజంలో కంప్యూటర్ విద్య ఎంతో అవసరమని మహిళా సాధికారిక ఆర్థిక నిపుణులు విజయకుమార్, సీడీపీవో రోజ అన్నారు. బుధవారం మద్దూర్‌లో కంపూటర్ శిక్షణ కేంద్రంలో బాలికలకు అందుతున్న శిక్షణను పరిశీలించారు. ఈ సందర్భంగా కంప్యూటర్ శిక్షణ మెటీరియల్‌ను బాలికలకు అందజేశారు. కేంద్రం నిర్వాహకుడు నిర్వాహకుడు ఖరీమొద్దిన్, బేటీ పడావో బేటీ బచావో పథకం సభ్యురాలు శ్రావణి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై ప్రత్యేక సమావేశం



15వ ఆర్థిక సంఘం నిధుల గురించి వివరిస్తున్న అధికారి

నారాయణపేట టౌన్, ఫిబ్రవరి 7 : జిల్లా పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక 2024-25 సంవత్సరానికి గాను 15వ ఆర్థిక సంఘం నిధుల గురించి జడ్పీ చైర్‌పర్సన్ వనజ ఆం జనేయులు అధ్యక్షతన బుధవారం ప్రత్యేక సమావేశం జరిగింది. ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టాలి, గైడ్‌లైన్ వివరాలను సంబంధిత శాఖల అధికారులు, జడ్పీటీసీలకు వివరించారు. సమావేశంలో జడ్పీటీసీ సభ్యులు రఘుపతిరెడ్డి, ప్రకాష్‌రెడ్డి, అంజలి, అశోక్, లావణ్య, కోఆప్షన్ తాజుద్దీన్, జడ్పీ సీఈవో శైలజ, డిప్యూటీ సీఈవో జ్యోతి, మిషన్ భగీరథ ఈఈ రంగారావు, డీఆర్డీఏ పీడీ గోపాల్, వ్యవసాయ అధికారి జాన్ సుధాకర్, ఫిషరీస్ అధికారి రాణాప్రతాప్, జిల్లా వెటర్నరి శ్రీనివాస్, డీఈవో అబ్దుల్ ఘనీ పాల్గొన్నారు.

విద్యార్థులు సమయం వృథా చేయొద్దు

నారాయణపేట టౌన్, ఫిబ్రవరి 7 : పది పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులు సమయం వృథా చేయరాదని బీసీ అభివృద్ధి జిల్లా అధికారి కృష్ణమా చారి బుధవారం అన్నారు. బుధవారం నారాయణపేట బీసీ బాలికల హస్టల్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతి గృహం పరిసరాలు, మరుగుదొడ్లు, కిచన్, విద్యార్థులకు వండిన ఆహారం పరిశీలించి, రుచి చూశారు. అనంతరం విద్యార్థినులతో కలిసి ధ్యానం, యోగాలో పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీలు.. అమలు చేస్తాం

» ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి



కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మాగనూరు, ఫిబ్రవరి 7 : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను ఖచ్చితంగా అమలు చేస్తోందని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో 44 మంది కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరలోనే రూ.500లకు గ్యాస్ సిలిండర్, 200 యూనిట్లు ఉచిత కరెంటు అమలు చేయనున్నట్లు తెలిపారు. తరువాత వచ్చే కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీతో తులం బంగారం ఇవ్వడం జరుగుతుందన్నారు. కుటుంబంలో ఇద్దరు వృద్ధులు పింఛన్లకు అర్హత ఉంటే ఇద్దరికి ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్యామలమ్మ, వైస్ ఎంపీపీ తిప్పయ్య, జడ్పీటీసీ సభ్యుడు వెంకటయ్య, సింగిల్‌విండో అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ సతీష్‌కుమార్, ఆర్ఐ శ్రీశైలం, డీటీ అమీర్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, ఎంపీటీసీ సభ్యుడు ఎల్లారెడ్డి, వాకిటి శ్రీనివాసులు, ఉజ్జల్లి కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

అధికారులు అందుబాటులో ఉండాలి : ఎమ్మెల్యే

కృష్ణ : గ్రామాల్లో ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పూర్ణిమ అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఏవో సుదర్శన్‌గౌడ్ తమ నివేదిక సభకు చదివి వినిపించారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై ఎరువులు ఇస్తున్నా రైతులపై అదనంగా రూ.45 నుంచి రూ.60 భారం పడుతోందని ఎమ్మెల్యే పేర్కొనగా, రేగా పాయింట్ ఉమ్మడి పాలమూరు జిల్లా జడ్చర్ల దగ్గర ఉన్న గోదాం నుంచి ఇక్కడికి వచ్చే లోడింగ్ ఆన్ లోడింగ్ ఖర్చు అవుతోందన్నారు. అందుకు మక్తల్ నియోజకవర్గం ఉట్కూరు, నర్వ, మక్తల్, మాగనూర్ మండలాల్లో వరి సాగు చేస్తున్న రైతులు రేగా పాయింట్ కోసం ఇప్పటికే అనుకూలంగా ఉన్న ప్రభుత్వ భూములు 60 ఎకరాలు అవసరం ఉందని, జనవరి 18 వరకు నిర్ణయం తీసుకుంటామన్నారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మాట్లాడుతూ మండలంలో ఇప్పటికే ఉన్న 33 అంగన్‌వాడీ కేంద్రంలో ఐనాపూర్ గ్రామంలో మాత్రమే సొంత భవనం ఉందని, మిగితా 32 కేంద్రాలు అద్దె భవనంలో కొనసాగుతున్నాయని సభ దృష్టికి తీసుకొచ్చారు. అందుకు ఎమ్మెల్యే పాత గ్రామ పంచాయతీ పాఠశాల భవనంలో కేంద్రాలు కొనసాగించాలని, అందుకు ప్రభుత్వం అద్దె కూడా ఆదా చేసినట్లు అవుతుందన్నారు. అంతకుముందు ఎమ్మెల్యేను కాంగ్రెస్ హిందూపూర్ మాజీ సర్పంచు లక్ష్మీనారాయణగౌడ్ సన్మానించారు. ఎంపీడీవో యశోద మాజీ సర్పంచులను సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఈశ్వర్‌గౌడ్, ఎంపీటీసీ సభ్యుడు రామచంద్ర, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

» ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి » విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



ఆర్మీ కోచింగ్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందిస్తున్న ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి

నారాయణపేట, ఫిబ్రవరి 7 : లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమని భవిష్యత్‌లో మరింతగా సేవలు విస్తృతం చేయాలని ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. బుధవారం పేట లయన్స్ క్లబ్ భవన్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ నారాయణపేట, డిఫెన్స్ వారియర్స్ అకాడమి వారు నిర్వహిస్తున్న ఉచిత ఆర్మీ కోచింగ్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అదే విధంగా మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సలీం, లయన్స్ క్లబ్ సభ్యులు సాయినాథ్, రవి, ఆర్మీ జవాన్ ఆంజనేయులు, డాక్టర్ నగేష్, శ్రీనివాస్, ఆత్మారాం, భీంచందర్, సత్యనారాయణ, కృష్ణమూర్తి, సదానంద చారీ, విద్యార్థులు పాల్గొన్నారు.

నిలువురాళ్ల మాస పత్రిక ఆవిష్కరణ

విద్యా ప్రగతి స్ఫూర్తిదాయక కథనాల మాస పత్రిక నిలువు రాళ్ల ప్రతిని ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి, విద్యాశాఖ అధికారులతో కలిసి బుధవారం స్థానిక సీవీఆర్ బంగ్లాలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యాభివృద్ధికి ఎల్లప్పుడు ముందుంటానన్నారు. చిన్నారులు, ఉపాధ్యాయులను ప్రోత్సహించేలా పత్రికను తీసుకొచ్చిన విద్యాశాఖ అధికారులను అభినందించారు. విద్యకు తన నిధుల్లోంచి 35 శాతం కేటాయిస్తానని, ముడుమాల్ నిలువురాళ్ల ఖ్యాతిని అందరికీ తెలియజేసేలా మౌలిక సదుపాయాలను కల్పిస్తానని, విద్యార్థులు, పాఠశాల అభివృద్ధికి ఎల్లప్పుడు సహాయం అందిస్తానని మక్తల్ ఎమ్మెల్యే వాటికి శ్రీహరి అన్నారు. రాష్ట్రంలోనే మన జిల్లాలో మాస పత్రిక వెలువడడం, కృషి చేసిన డీఆర్పీ బృందాన్ని అభినందించారు. ఉపాధ్యాయులు తమ రచనలను, సూచనలను మాస పత్రిక ద్వారా అందించాలని కోరారు. జిల్లాలోని 672 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు దాతల సహకారంతో మాస పత్రికను ఉచితంగా అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఏఎంవో విద్యాసాగర్, సీఎంవో రాజేంద్ర, ఎస్‌వో నాగార్జున, శ్రీనివాస్, డీవైఎస్‌వో వెంకటేష్, జిల్లా రిసోర్స్ పర్సన్స్ నరేందర్, రాఘవేంద్ర, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మద్దూర్ సమగ్రాభివృద్ధికి ప్రతిపాదనలు

» కాడా అధికారి వెంకట్‌రెడ్డి



మద్దూర్ పట్టణ రోడ్డు విస్తరణను పరిశీలిస్తున్న కాడా అధికారి వెంకట్‌రెడ్డి

మద్దూర్, ఫిబ్రవరి 7 : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాను సారం మద్దూర్ పట్టణ సమగ్రాభివృద్ధికి ప్రత్యేక ప్రతిపాదలను తయారు చేయడం జరుగుతోందని కాడా ప్రత్యేకాధికారి వెంకట్‌వెడ్డి అన్నారు. ఈ మేరకు బుధవారం మద్దూర్ పట్టణాన్ని సందర్శించి పెండింగ్‌లో ఉన్న రోడ్ వైండింగ్ ప్రాంతాన్ని, నిర్మించనున్న గురుకుల పాఠశాల స్థలాన్ని ఆయన పరిశీలించారు. పట్టణ అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకోవాలి, ముఖ్య అవసరాలు తదితర వాటిని అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో చర్చించారు. మద్దూర్‌ను మునిసిపాలిటీగా ఏర్పాటు చేయాలని, పాత బస్టాండ్ చౌరస్తా నుంచి పేట, కోస్గి, భూనీడ్, ఖాజీపూర్, నిడ్జింత, రావులపల్లి, రెనివట్ల, పెదిరిపాడ్ తదితర రోడ్లలో కిలోమీటర్ నుంచి 1.5 మేరా సెంటర్ లైటింగ్ డివైడర్లతో కూడిన రోడ్డు విస్తరణ చేపట్టాలని, మద్దూర్ ఆసుపత్రి 30 పడకల నుంచి 100 పడకల వరకు స్థాయిని పెంచాలన్నారు. మద్దూర్‌తో పాటు పరిసర మండలాల 86 గ్రామాలకు కేంద్ర బిందువుగా ఉన్న మద్దూర్‌లో డిగ్రీ, పాలిటెక్నిక్, ఐటీఐ కళాశాలు ఏర్పాటు చేయాలని, ప్రణాళికా బద్ధ డ్రైనేజీలతో కూడిన అంతర్గత రోడ్లు అభివృద్ధి చేయాలన్నారు. అసంపూర్తిగా ఉన్న మద్దూర్ - కోయిలకొండ డబుల్ రోడ్ నిర్మాణానికి సత్వర చర్యలు తీసుకోవాలని వీటితో పాటు అనే అభివృద్ధి పనులు చేట్టాలని జడ్పీటీసీ సభ్యుడు రఘుపతిరెడ్డి, ఎంపీపీ విజయలక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ నరసింహ, మండల ముఖ్య నాయకులు వీరేశ్‌గౌడ్, వీరారెడ్డి, హన్మిరెడ్డి, సతీశ్ కాడా అధికారి దృష్టికి తీసుకొచ్చారు. పట్టణాభివృద్ధికి చేపట్టాల్సిన పనులపై ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులను కాడా అధికారి వెంకట్‌రెడ్డి ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బీ డిప్యూటీ ఈఈ రాములు, వివిధ శాఖల అధికారులు తదితరులు ఉన్నారు.

గొర్రెలు పంపిణీ చేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న అఖిల భారత ప్రగతి శీల రైతు సంఘం నాయకులు

నారాయణపేట టౌన్, ఫిబ్రవరి 7 : జిల్లా వ్యాప్తంగా గొర్రెల కోసం డీడీలు చెల్లించిన ప్రతీ ఒక్కరికీ గొర్రెలను పంపిణీ చేయాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం ఆధ్వర్యంలో గొర్రెల కాపరులు, నాయకులు బుధవారం జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిల భారత ప్రగతి శీల రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాము, జిల్లా ప్రధాన కార్యదర్శి యాదగిరి, భగవంతు మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం గొర్రెల పంపిణీని రాష్ట్రంలో అట్టహాసంగా ప్రారంభించి, పూర్తి స్థాయిలో గొర్రెలను పంపిణీ చేయలేదన్నారు. ఈ పథకం మధ్య దళారులు, కమీషన్ ఏజెంట్ల పంట పండిందే తప్పా అసలైన లబ్ధిదారులకు గొర్రెలు అందలేదన్నారు. ఓట్ల కోసమే ఈ పథకాన్ని వినియోగించుకున్నారని, రాష్ట్ర వ్యాప్తంగా 9 నెలల క్రితం గొల్ల, కురుమలచే డీడీలు కట్టించుకొని గొర్రెలు అందించకుండా నిలువునా దోచుకున్నారన్నారు. జిల్లా వ్యాప్తంగా 5,912 మంది గొల్ల, కురుమలకు గొర్రెలు అందాల్సి ఉందని, కేసీఆర్ ఎన్నికల అవకాశవాద విధానం వల్ల డీడీలు చెల్లించిన కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గత ప్రభుత్వ విధానాలను గుణపాఠంగా తీసుకొని ప్రజా సంక్షేమాన్ని అవలంబిస్తూ గొర్రెలు పంపిణీ చేయాలని కోరారు. అలాగే ఎన్నికల హామీల్లో భాగంగా ఆరు గ్యారెంటీలు అమలు చేయాలన్నారు. లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. అంతకుముందు తహసీల్దార్ ప్రతాప్‌సింగ్‌ను కలిసి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా, ఇఫ్టూ నాయకులు కాశీనాథ్, నరసింహ, రాము, వెంకట్‌రెడ్డి, చెన్నారెడ్డి, లింగప్ప, రాగప్ప, కతలప్ప, వెంకట్రాములు, ప్రశాంత్, భాస్కర్, అంజి, సాయి, రాములు, ప్రశాంత్, హాజీ తదితరులు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర కల్పించాలి



కరపత్రాలతో ప్రచారం చేస్తున్న రైతు సంఘం నాయకులు

నారాయణపేట రూరల్, ఫిబ్రవరి 7 : రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించి కనీస మద్దతు ధర కల్పించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని కోటకొండలో ఈనెల 16న జరిగే గ్రామీణ భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని కోరుతూ ఇంటింటికి కర పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు ఆత్మహత్యల నుంచి బయట పడాలంటే కేరళలో మాదిరిగా రైతు రుణ విమోచన చట్టం తీసుకురావాలన్నారు. కార్మికులను బానిసతవ్వంలో నెట్టే నాలుగు కార్మిక కోడ్‌లను వెంటనే కేంద్ర ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం బ్యాంకింగ్, బొగ్గు, రైల్వే, విమానయానం తదితర దేశ సంపదను ఆదాని, అంబానీలకు అప్ప చెబుతున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం మతోన్మాద, కార్పొరేట్ విధానాల పట్ల దేశం అధోగతి పాలవుతుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం వెంకట్రామారెడ్డి, బాల్‌రాం, దస్తప్ప, బాలప్ప, కాశప్ప, మల్లేష్, నరహరి, గోవిందు, భాస్కర్ పాల్గొన్నారు.

వాహనదారులు సద్వినియోగం చేసుకోవాలి

» పెండింగ్ చలాన్లను వెంటనే చెల్లించాలి » ఎస్పీ యోగేష్ గౌతమ్

నారాయణపేట, ఫిబ్రవరి 7 : రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ చలాన్లపై భారీ డిస్కౌంట్ ప్రకటించిందని, జిల్లాలోని వాహనదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ యోగేష్ గౌతమ్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఆర్టీసీ బస్సులు, తోపుడు బండ్లకు 90 శాతం, బైక్‌లు, మూడు చక్రాల వాహనాలకు 80 శాతం, లారీలు, భారీ వాహనాలకు 60 శాతం రాయితీ ప్రకటించిందని, ఈనెల 15వ తేదీలోపు డిస్కౌంట్ చలాన్లను చెల్లించాలని ఎస్పీ కోరారు. 15వ తేదీ తర్వాత ప్రతి రోజు వాహనాలను తనిఖీ చేస్తామని, పెండింగ్‌లో చలాన్లు ఉంటే వాటిని కట్టించడం లేదా సీజ్ చేయడం జరుగుతుందన్నారు. వాహనదారులు విధిగా లైసెన్స్, పత్రాలను వెంట పెట్టుకోవాలని, నంబర్ ప్లేట్ ఉండాలని, నంబర్ ప్లేట్ లేని వాహనాలు రోడ్లపై వస్తే ఐపీసీ సెక్షన్ల కింద వాహనదారుడిపై కేసు నమోదు చేస్తామని ఎస్పీ హెచ్చరించారు.

సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి

సైబర్ నేరాలపై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఎస్పీ యోగేష్ గౌతమ్ అన్నారు. ప్రతీ నెలలో మొదటి బుధవారం సైబర్ నేరాలపై గ్రామాల్లో ప్రజలు, స్కూల్, కళాశాలలోని విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, సైబర్ నేరాలకు గురైతే 1930కి కాల్ చేయాలని, సైబర్ నేరగాళ్ల మోసపూరిత ఆశలను, లక్కీడ్రాలో గిఫ్టులు గెలుపొందారని, ఆన్‌లైన్‌లో తక్కువ ధరకే వాహనాలు, వస్తువులు దొరుకుతున్నాయని మోసం చేస్తారని వీటిని నమ్మొద్దు అన్నారు. కస్టమర్ కేర్ నంబర్లు వెబ్‌సైట్ ద్వారా పొందాలని, ఇతరులకు బ్యాంకు వివరాలు, ఖాతా వివరాలు ఇవ్వవద్దని, యాప్ ద్వారా రుణాలు తీసుకోవద్దని, అపరిచితులు ఇచ్చే క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయవద్దని, ఇతరులు వీడియో కాల్, మెసెజ్‌లు చేస్తే స్పందించొద్దు అన్నారు.

జడ్పీ సర్వసభ్య సమావేశం వాయిదా

నారాయణపేట టౌన్, ఫిబ్రవరి 7 : ఈనెల 10న జరగాల్సిన నారాయణపేట జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం వాయిదా వేసినట్లు జడ్పీ సీఈవో శైలజ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తదుపరి సమావేశం నిర్వహణ తేదీని ప్రకటిస్తామన్నారు.

క్రీడాకారిణులకు దుస్తులు పంపిణీ

మక్తల్, ఫిబ్రవరి 7 : రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన క్రీడాకారిణులకు ఈనాడు లక్ష్య అథ్లెటిక్స్ కోచింగ్ సెంటర్ నిర్వాహకుడు జగదీష్ దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా యువజన క్రీడల అధికారి వెంకటేష్‌శెట్టి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈనాడు లక్ష్య అథ్లెటిక్స్ కోచింగ్ సెంటర్ నిర్వాహకుడు జగదీష్ సొంత డబ్బులు ఖర్చుచేసి దుస్తులు పంపిణీ చేయడం అభినందనీయం అన్నారు. హెచ్ఎం సుగుణ, రమణమ్మ పాల్గొన్నారు.

'సతీష్‌మాదిగ నోరు అదుపులో పెట్టుకో'

దామరగిద్ద, ఫిబ్రవరి 7 : చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను సతీష్ మాదిగ కులం పేరుతో దూషించడం సమంజసం కాదని జాతీయ మాల ఐక్యవేదిక నారాయణపేట జిల్లా అధ్యక్షుడు గ్యాంగ్ హన్మంతు హెచ్చరించారు. బుధవారం ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ ఒక దళితుడుపై ఉండి సాటి దళితుడిని తిట్టడం సరి కాదని హెచ్చరించారు.

మౌలిక వసతులు కల్పించాలి

మక్తల్, ఫిబ్రవరి 7 : మక్తల్ పట్టణ శివారులో ఉన్న బీసీ కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ బుధవారం కాలనీ వాసులు ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీ కాలనీలో దాసరి, బుడగ జంగాలు, అవుసలి, కమ్మరి వాళ్లు నివసిస్తున్నట్లు తెలిపారు. కాలనీలో పాఠశాల, తాగునీరు, సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేకు విన్నవించారు. ఈ సందర్భంగా అన్ని వసతులు కల్పిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేత

నారాయణపేట రూరల్, ఫిబ్రవరి 7 : మండల పరిధిలోని జాజాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు మండల స్థాయి పోటీలు నిర్వహించారు. డ్రాయింగ్, కవిత్వం, పాటలు, ఉపన్యాస విభాగంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి భానుప్రకాశ్, హెచ్ఎం కనకప్ప, ఉపాధ్యాయులు దేవీరాణి, గిరిజ, ప్రసాద్, వనిత, లక్ష్మణ్ పాల్గొన్నారు.

23న వాహనాలకు వేలం

నారాయణపేట, ఫిబ్రవరి 7 : మక్తల్ పీఎస్ పరిధిలో పట్టుబడిన వాహనాలకు ఈనెల 23న వేలం వేయనున్నట్లు అదనపు ఎస్పీ నాగేంద్రుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం పోలీసుల ఆధీనంలో 16 వాహనాలు ఉండగా, టాటా ఏసీ ఒకటి, 15 బైక్‌లు ఉన్నాయన్నారు. వీటిలో ఎవరివైన వాహనాలు ఉంటే వాటి రిజిస్ట్రేషన్ నంబర్, ఇంజన్ నంబర్, తదితర వాటి ఆధారంగా బాధితులకు అప్పగిస్తామన్నారు. వాహనాలను ఎవరూ తీసుకెళ్లని పక్షంలో 23న చట్ట ప్రకారం వేలం వేస్తామన్నారు.

ఆన్‌లైన్ ద్వారా ఇసుక అనుమతులు ఇవ్వాలి

మరికల్, ఫిబ్రవరి 7 : మండలంలోని వివిధ గ్రామాల్లో ఇసుక లేక ఇండ్ల నిర్మాణాలు నిలిచి పోయాయని, వెంటనే ఆన్‌లైన్ ద్వారా ఇసుక సరఫరా చేయాలని బుధవారం ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేష్ తహసీల్దార్ సునీతకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు నెలలుగా మండలంలో ఇసుక లేక ఇండ్ల నిర్మాణాలు నిలిచిపోవడంతో మేస్త్రీలు చివరకు పనులు లేక వలస వెళ్లే పరిస్థితి ఏర్పడిందన్నారు. మార్కెట్‌లో బంగారం దొరుకుతుంది. కానీ ఇసుక మాత్రం దొరకడం లేదన్నారు. జిల్లా అధికారులు స్పందించి అన్‌లైన్ ద్వారా ఇసుక సరాఫరాకు అనుమతి ఇవ్వాలని కోరారు. లేకుంటే ఏఐటీయూసీ ఆధ్వర్యంలో తహసీల్ధార్ కార్యాలయం ముందు ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాము, దేవదాస్, బాలకృష్ణ, మొగులప్ప, కుర్మన్న, అఖిల పక్ష నాయకులు పాల్గొన్నారు.

'కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి'

మరికల్, ఫిబ్రవరి 7 : దేశ ప్రజల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కేంద్ర ప్రభుత్వ మాజీ సహాయ న్యాయవాది రఘువీర్ యాదవ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 500 ఏళ్ల భారతీయుల కల అయినటువంటి రామ మందిరం నిర్మాణాన్ని చేపట్టిన మహోన్నతమైన వ్యక్తి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. కేంద్ర పథకాలైన ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా యోజన, సురక్ష బీమా యోజన, విశ్వకర్మ అవాస్ యోజన, పీఎం కిసాన్, అన్న యోజనలాంటి పథకాలు ప్రవేశపెట్టి ప్రజలను ఆదుకుంటున్న ఘనత మోదీకే దక్కుతుందన్నారు. ఎంపీ ఎన్నికల్లో డబుల్ డిజిట్ ఎంపీ స్థానాలు గెలిచే విధంగా కృషి చేయాలన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

మక్తల్, ఫిబ్రవరి 7 : మక్తల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జాతీయ రహదారి 167పై ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు సీఐ చంద్రశేఖర్ అన్నారు. బుధవారం ఎస్ఐ భాగ్యలక్ష్మీరెడ్డితో కలిసి జాతీయ రహదారిపై ప్రమాదాలు జరిగే తొమ్మిది ప్రదేశాలను గుర్తించినట్లు తెలిపారు. జాతీయ రహదారిని కలుపుతూ ఉన్న గ్రామీణ రోడ్లపై ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, గ్రామాల నుంచి హైవేపైకి వచ్చే రోడ్లకు స్పీడ్ బ్రేకర్లు, వైట్ పెయింట్ వేయించడం జరుగుతుందన్నారు. రోడ్డు మలుపుల వద్ద సైన్ బోర్డులతో పాటు అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. ద్విచక్ర వాహనాదారులు హెల్మెట్, కారు డ్రైవర్లు సీటు బెల్టు ధరించాలన్నారు.

కొనసాగుతున్న ధాన్యం విక్రయాలు

నారాయణపేట, ఫిబ్రవరి 7 : నారాయణపేట వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం ధాన్యం విక్రయాల జోరు కొనసాగింది. వేరు శనగలు 1,593 క్వింటాళ్లు విక్రయానికి రాగా, క్వింటాలుకు ధర గరిష్ఠంగా రూ.6,733, కనిష్ఠంగా రూ.3,505, రమారమి రూ.6,300 పలికింది. శనగలు 14 క్వింటాళ్లు రాగా, క్వింటాలుకు ధర గరిష్ఠంగా రూ.6,129, కనిష్ఠంగా రూ.6,089, పెసర్లు క్వింటాలు రాగా గరిష్ఠ, కనిష్ఠంగా రూ.8,060, అలసందలు 31 క్వింటాళ్లు రాగా, క్వింటాలుకు ధర గరిష్ఠంగా రూ.7,561, కనిష్ఠంగా రూ.5861, రమారమిగా రూ.7561, ఎర్ర కందులు 115 క్వింటాళ్లు రాగా, క్వింటాలుకు ధర గరిష్ఠంగా రూ.10,835, కనిష్ఠంగా రూ.7,889, రమారమిగా రూ.10,515, తెల్ల కందులు 21 క్వింటాళ్లు రాగా, క్వింటాలుకు ధర గరిష్ఠంగా రూ.10,959, కనిష్ఠంగా రూ.9,900, రమా రమిగా రూ.10,912 పలికింది.